ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

కో ప్రశ్నలు... సమస్యలకు నిలయాలు...



మరుగుదొడ్లకు డోర్లు సరిగాలేని అల్లూరులోని బాలికల హాస్టల్



స్లాబ్ పెచ్చులూడి పడుతున్న అల్లూరులోని బాలికల హాస్టల్ భవనం

● మౌలిక వసతులు కరువు ● పాములకు ఆవాసంగా వీరులపాడు ఎస్‌సి బాలుర హాస్టల్ ● శిథిలావస్థలో అల్లూరు బాలికల వసతి గృహం ● వార్డెన్‌లేక ఇంకా తెరుచుకోని జుజ్జూరు బిసి హాస్టల్

హాస్టల్ విద్యార్థుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఏ హాస్టల్లో చూసినా మౌలిక వసతులు కొరతగా ఉన్నాయి. అనేక భవనాలు శిథిలావస్థలో ఉంటున్నాయి. మరుగుదొడ్లు, మంచినీటి వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడులోని మూడు ప్రభుత్వ వసతి గృహాలను ప్రజాశక్తి పరిశీలించింది. ఈ పరిశీలనలో అనేక అంశాలు వెలుగుచూశాయి. మండల కేంద్రమైన వీరులపాడులోని ఎస్‌సి బాలుర సంక్షేమ హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, విషపు పురుగులు సంచరిస్తున్నాయి. మండలంలోని అల్లూరు ఎస్‌సి బాలికల వసతి గహం మరుగుదొడ్లకు డోర్లు లేవు. పురాతన భవనంలో ఏర్పాటు చేసిన శిథిలావస్థలో ఉన్న ఈహాస్టల్ స్లాబు పైకప్పులు ఎప్పుడు తమపై పడతాయోనని విద్యార్థినులు భయాందోళనలు చెందుతున్నారు. రక్షణ లేకపోవడంతో రాత్రిపూట వసతి గహంలో భోజనం చేసి సమీపంలోని విద్యార్థునులు తమ ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మరోవైపు జుజ్జూరులోని బిసి బాలుర వసతి గృహం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ పనిచేసిన హాస్టల్ వార్డెన్ అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లినా అధికారులు మరో వార్డెన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో హాస్టల్‌ను ఇంకా ప్రారంభించలేదు.

ప్రజాశక్తి - వీరులపాడు : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలో ఆరు జిల్లా పరిషత్ పాఠశాలలు, మూడు విద్యార్థి వసతి గహాలు ఉన్నాయి. మండల కేంద్రమైన వీరులపాడులో ఉన్న ఎస్‌సి బాలుర సంక్షేమ హాస్టల్‌లో 65 మంది విద్యార్థులు ఉన్నారు. మూడు నుండి 8వ తరగతి వరకు చదువుతున్న (మిగతా 2లో)



ప్రహరీ గోడ లేని వీరులపాడు హాస్టల్




బ్యారేజీకి వరద

వార్త మెయిన్‌లో

కృష్ణా డిఎంహెచ్‌ఒగా యుగంధర్ బాధ్యతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కష్ణాజిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ పి.యుగంధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన ఉద్యోగోన్నతుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమితులై కృష్ణాజిల్లాకు వచ్చారు. యుగంధర్ ఎముకల శస్త్ర చికిత్స నిపుణునిగా విజయవాడ సిద్దార్థ వైద్య కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. బాధ్యతలు చేపట్టిన యుగంధర్‌కి కష్ణాజిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ జి.భానుమూర్తి, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.





వార్త మెయిన్‌లో

సముద్రతీరంలో 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు : డిప్యూటీ సిఎం పవన్

భారీ వర్షాలు

● కృష్ణాజిల్లాలో సగటు వర్షపాతం 46.2 మిమీ ● నేలవాలిన వరి ● ధాన్యం దిగుబడులపై ఆందోళన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ముసురు అలముకుంది. ఆకాశం మేఘావృతమై ఉంటోంది. దీంతో కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి నేల వాలింది. ఐదు మండలాల్లోని 172. 4 హెక్టార్లలో వరికి నష్టం జరిగింది. ముసురు వాతావరణం వరి దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాజిల్లా సగటు వర్షపాతం 46.2 మిమీ నమోదు

గురువారం ఉదయం 8.30 నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు (గడిచిన 24 గంటల్లో) కృష్ణాజిల్లాలో సగటున 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం వరకు తేలికపాటి వర్షాలు పడుతూనే ఉన్నాయి. గూడూరు మండలంలో అత్యధికంగా 89.2 మిల్లీమీటర్లు, నాగాయలంకలో అత్యల్పంగా 19.6 మిమీ వర్షపాతం నమోదైంది.

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిమీ)
గూడూరు	89.2
చల్లపల్లి	86.4
పమిడిముక్కల	71.6
ఘంటసాల	68.2
పెడన	64.0
మచిలీపట్నం	58.6
మొవ్వ	56.0
గుడ్లవల్లేరు	55.6
ఉయ్యూరు	51.2
గుడివాడ	50.0
ఉంగుటూరు	44.4
కంకిపాడు	42.8
పెదపారుపూడి	42.6
మోపిదేవి	41.4
బంటుమిల్లి	38.2
నందివాడ	37.4
బాపులపాడు	34.6
పెనమలూరు	32.4
కృత్తివెన్ను	32.2
తోట్లవల్లూరు	30.6
గన్నవరం	30.4
కోడూరు	23.8
పామర్రు	21.4
అవనిగడ్డ	21.2
నాగాయలంక	19.6
మొత్తం	1202.4

వరి దిగుబడులపై రైతన్న దిగాలు

కృష్ణాజిల్లాలో లక్షా 56 వేల 901 హెక్టార్లలో వరి సాగవుతోంది. వరిసాగు ద్వారా 11 లక్షల 65 వేల 633 టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ ప్రాధమికంగా అంచనా వేసింది. అల్పపీడనాలు, తుపాను ప్రభావాలు లేకుండా వాతావరణంలో తగిన ఉష్ణోగ్రతలు ఉంటేనే వ్యవసాయశాఖ అంచనాలకు తగిన విధంగా దిగుబడులు వస్తాయి. వివిధ ప్రాంతాల్లో 130 రోజులు, 70 రోజులు స్వల్పకాలికంగా 50 రోజులు దశలో పంట ఉంది. భారీ వర్షాలకు కంకి పాలు పోసుకోనే, ఈత దశలో వరి పొలాలు ఉంటాయి. మచిలీపట్నం మండలంలో 33.6 హెక్టార్లలో, తోట్లవల్లూరులో 0.8 హెక్టార్లు, పెడనలో 101, గూడూరులో 20, కంకిపాడులో 8 హెక్టార్లలో వరి నేల వాలింది. 316 మంది రైతులకు సంబంధించిన పంటకు నష్టం వాటిల్లే అవకావం ఉందని వ్యవసాయశాఖ ప్రాధమికంగా అంచనా వేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి క్షేత్రాల్లో తప్ప, తాలు పోయే గింజల శాతం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ మేరకు దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నారు.



ఉపాధి కల్పనకు ఉత్ప్రేరకంగా రోజ్‌గార్ మేళాలు

కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఉపాధి కల్పనకు రోజ్‌గార్ మేళాలు ఉత్ప్రేరకంగా నిలుస్తాయని భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో శుక్రవారం 17వ విడత రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వం, కేంద్రపాలిత ప్రాంతాల్లోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు మిషన్ మోడ్ నియామకాలను చేపడుతున్నాయన్నారు. యువతకు సాధికారత, దేశ నిర్మాణంలో పాల్గొన డానికి రోజ్‌గార్ మేళాలు అర్థవం తమైన అవకాశాలను అందిస్తాయన్నారు. కొత్తగా నియామకాలం పొందిన వారికి ఐగాట్ కర్మయోగి పోర్టల్లోని ఆన్లైన్ మాడ్యూల్ 'కర్మయోగి ప్రారంభ ద్వారా శిక్షణ పొందే అవకాశం కూడా లభిస్తోందని, ఇక్కడ 'ఎక్కడైనా, ఏదైనా పరికరం' ద్వారా నేర్చుకోవడానికి 3,600 కంటే ఎక్కువ ఇ-లెర్నింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రోజ్గార్ మేళా ద్వారా కేంద్ర ప్రభుత్వ వివిధ విభాగాలయిన రైల్వే , పోస్టల్ , ఇస్రో, ఎయిర్పోర్ట్ అథారిటీ, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్, ఫైనాన్స్ సర్వీస్ లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో చీఫ్ పోస్ట్మాస్టర్ జనరల్ బి పి శ్రీదేవి, పోస్ట్మాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర వెంకట రమణ మూర్తి, ఏడీఆర్ఎం ఎడ్విన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

విజయవంతంగా తెలుగు సినీ కళా వైభవం

విజయవాడ : తెలుగు చలన చిత్రానికి 94 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నగరంలోని పలు సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో.. గురువారం నుంచి వారం రోజుల పాటు స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానంద కళావేదికపై జరుగుతున్న తెలుగు సినీ కళా వైభవం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సాంస్కృతిక - సామాజిక సేవా సంఘం వారు సినీ సంగీత విభావరితో అలరించారు. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు కె.డేవిడ్ రాజు,



కుమార్, కె.ఈశ్వర రావు, డాక్టర్ రాధా మాధవి పాల్గొన్నారు. మారేపల్లి జోషి, ఎ.జయప్రభు, పి.శ్రీనివాసరావు, ఎడ్విన్ జోసఫ్, బొబ్బిలి మల్లీశ్వరి, శైలజ, సుమలత, ప్రిన్స్ తదితరులు వివిధ చలన చిత్రాల్లోని సోలో, డ్యూయెట్ హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. కార్యక్రమాన్ని డా. కొప్పుల అశోక్ ఆనంద్ వ్యాఖ్యానం పరిపుష్టంచేసింది. కార్యక్రమ విజయవంతానికి కె.నరేష్ నేతత్వంలోని దేవా సౌండ్స్ దోహదపడింది. సినీ నటుడు, ఫైట్ మాస్టర్ రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బి.వి.వీరభద్రరావు, డా. పరుచూరి విజయలక్ష్మి, సీహెచ్ చిట్టిబాబు కార్యక్రమాన్ని సమన్వయపరిచారు.

74 మంది వాహనదారులకు జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 74 మంది వ్యక్తులకు న్యాయమూర్తి జరిమానా విధించారు. 51వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 74 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని శుక్రవారం ఏడో అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆర్.వి.ఎస్.శర్మ మొత్తం 74 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.7.40 లక్షల మేర జరిమానా విధించారు.

హోంగార్డులకు హెల్మెట్లు పంపిణీ చేసిన సిపి

ప్రజాశక్తి - విజయవాడ : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం హోంగార్డులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఆప్ సబ్‌కి ఆవాజ్ స్వచ్ఛంద సంస్థ వారు పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు 120 హెల్మెట్లను అందించారు. వీటిని సిపి పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి కె.జి.వి.సరిత, హోంగార్డ్స్ కమాండెంట్ టి.ఆనందబాబు, ఎఆర్ ఎడిసిపి కె.కోటేశ్వర రావు, హోంగార్డ్స్ డిఎస్‌పి ఎన్.వి. రమణ, ఆర్‌ఐ సుధాకర రెడ్డి, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వి.శివ కుమార్, కార్యదర్శి బి కిరణ్



హోంగార్డులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న సిపి ఎస్.వి.రాజశేఖరబాబు

హాస్టళ్లు... సమస్యలకు నిలయాలు...

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు ఈ వసతిగృహంలో ఉంటున్నారు. వాచ్‌మన్, వంటమనిషి, వార్డెన్‌తో కలిపి ముగ్గురు సిబ్బంది ఉన్నారు. గ్రామ పంచాయతీ సరఫరా చేస్తున్న నీటినే విద్యార్థులకు తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. మరుగుదొడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. పూర్తి అపరిశుభ్రంగా ఉన్నాయి. గ్రామానికి దూరంగా ఎస్‌సి బాలుర సంక్షేమ హాస్టల్ కొనసాగుతోంది. ఈ వసతి గహాన్ని ఆనుకొని వ్యవసాయ భూములున్నాయి. వసతి గహానికి ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, విషపు పురుగులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని అల్లూరు ఎస్‌సి బాలికల వసతి గహంలో 27 మంది విద్యార్థులు ఉంటున్నారు. మూడు నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టల్‌కు చెందిన మరుగుదొడ్లకు డోర్లు లేవు. పురాతన భవనంలో ఏర్పాటు చేసిన ఈ హాస్టల్ స్లాబు పైకప్పులు ఎప్పుడు తమపై పడతాయోనని విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారు. బాలికల వసతి గహం శిథిలావస్థకు చేరింది. బాలికలకు రక్షణ సౌకర్యం లేకపోవడం వల్ల రాత్రిపూట వసతి గహంలో భోజనం చేసి సమీపంలోని విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వార్డెన్ మరో హాస్టల్‌కు కూడా ఇన్చార్జిగా ఉండడంతో నాలుగు రోజులకొకసారి వచ్చి వెళుతుంటారు. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తమ పిల్లలను అక్కడ ఉంచేందుకు భయపడుతున్నారు. జూన్లో ప్రారంభం కావాల్సిన జుజ్జూరులోని బిసి బాలుర వసతి గృహం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అనేక మంది పేద విద్యార్థులు హాస్టల్ సౌకర్యం లేకుండా పోయింది. గతంలో జుజ్జూరు బిసి హాస్టల్‌లో 90 మంది విద్యార్థులు ఉంటూ విద్యనభ్యసించేవారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూతపడిన ఈ హాస్టల్‌ను వెంటనే తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇక్కడ పనిచేసిన హాస్టల్ వార్డెన్ అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. అయితే జిల్లా స్థాయి అధికారులు మరో వార్డెన్‌ను ఏర్పాటు చేయకుండా, హాస్టల్‌ను ప్రారంభించకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జుజ్జూరు హాస్టల్‌ను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి అంచనాలు పంపారు

వీరులపాడు ఎస్‌సి బాలుర హాస్టల్ వార్డెన్ సయ్యద్ వీరాని

వీరులపాడు ఎస్‌సి బాలుర సంక్షేమ హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారని హాస్టల్ వార్డెన్ సయ్యద్ వీరాని తెలిపారు. ఇటీవల తాను బదిలీలపై ఇక్కడికి వచ్చానని చెప్పారు. అప్పటికే ప్రహరీ గోడ లేదన్నారు. నిధులు మంజూరైన వెంటనే అధికారుల పర్యవేక్షణలో ప్రహరీ నిరిస్తారని తెలిపారు.

అల్లూరు హాస్టల్‌కు కొత్త భవనానికి అధికారుల చర్యలు

అల్లూరు ఎస్‌సి బాలికల హాస్టల్ ఇన్చార్జి వార్డెన్ కమల

అల్లూరు ఎస్‌సి బాలికల వసతి గృహం ఇన్చార్జి వార్డెన్ కమల మాట్లాడుతూ తాను గండేపల్లి హాస్టల్ ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నానని చెప్పారు. అల్లూరు హాస్టల్ భవనం మరమ్మతులకు గురై బలహీనంగా ఉండడంతో విద్యార్థినులను చేర్చడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొత్త భవనం నిర్మాణానికి ఇంజినీరింగ్ శాఖ వారు అంచనాలు తయారుచేసి అధికారులకు పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం చేపడతామని అధికారులు చెప్పారని ఆమె పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

మండలంలోని జుజ్జూరు హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ వీరులుపాడు మండల నాయకులు షేక్ జాన్ సైదా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల వసతి గృహం మూసివేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని అన్ని హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న వరిపొలాల పరిశీలన



కంకిపాడులో పొలాలు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలో పునాదిపాడు, కోలవెన్ను, ప్రొద్దుటూరు గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన వరి పంటను వ్యవసాయ అధికారి పద్మావతి, వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయభాస్కర్ రెడ్డి, కషి విజ్ఞాన కేంద్రం ఘంటసాలకు చెందిన డాక్టర్ బి నవీన్‌లు పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వరి పంటలో నీళ్ళు నిలవకుండా డ్రైనేజ్ చానల్స్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉషారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చల్లపల్లి : గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయా ధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మేకవారిపాలెంలో పర్యటించి పంట పొలాలను పరిశీలిం చారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ 12,519 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేస్తూ ఉండగా 11,913 ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం వరి సింహ భాగం పాలు పోసుకునే దశలో ఉందని, గత మూడు, నాలుగు రోజులుగా వాతావరణం మేఘవత్తంగా ఉన్నందున చీడ పేడల ఉధతికి అవకాశం ఉందన్నారు. పొలాలలోని నీటిని వెంటనే బయటికి తీయాలని రైతులకు సూచించారు. ఒక ఎకరానికి 30 కేజీల యూరియా 15 కిలోల పటాస్ పైపాటుగా వేయాలని తెలిపారు.



చల్లపల్లి మండలంలో రైతులకు సూచలిస్తున్న అధికారులు

పొలంలో పొడతెగులు ఉధతి గమనించిన ఎడల హెక్సోకానాజోల్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో లేదాప్రొపికోనాజోల్ ఒక మిల్లీలీటర్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అగ్గి తెగులు లక్షణాలు గమనించినట్లయితే ఒక ఎకరాకు 0. 68 ట్రైసై క్లోజోల్ ద్రావణాన్ని ఒక లీటర్ నీటిలో కలిపి మొక్క తడిచే వరకు పిచికారి చేయాలి అన్నారు. సుడిదోమ కనపడి నట్లయితే డినిటోఫ్యూరిడాన్ 0. 48 లేదా పై మెట్రోజిన్ 0. 68 ద్రావణాన్ని ఒక లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. మరింత సమాచారం కొరకు రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను అడిగి తెలుసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో విఎఏ శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-కంకిపాడు : ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ను నిర్వహిస్తున్నారనే సమాచారంతో సీఐ మురళీకృష్ణ ఆదేశాలతో ఎస్ఐలు డి సందీప్ (కంకిపాడు), సురేష్ (ఉయ్యూరు) లో సారథ్యంలో పోలీసులు దాడి చేశారు. కోలవెన్ను కు చెందిన కొలుసు లక్ష్మణ్ ఉప్పులూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కంకిపాడు కు చెందిన షేక్ దస్తగిరి ఆటగాళ్ళు ను రప్పించి పేకాటను నిర్వహించారని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో 13 మంది ఆటగాళ్ల ను అదుపులోకి తీసుకుని, వారి నుండి రూ. లక్ష 72 వేలు, ఒక కారు,10 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిర్వాహకులతో పాటు,ఆటగాళ్ళు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి సందీప్ విలేకరులకు తెలిపారు.



నూతన డిఎంహెచ్ఒను కలిసిన డాక్టర్ భానుమూర్తి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ యుగంధర్ శుక్రవారం ఉదయం బాధ్యత స్వీకరించారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి భానుమూర్తి, తోటి సిబ్బందితో కలిసి యుగంధరకు మొక్కను బహుకరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉన్న సర్వ జన ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వివరించారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణమే చెల్లించి ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సముద్రాల అంబేద్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బకాయి ఉన్న 650 కోట్ల రూపాయలను చెల్లించాలని ధర్నా చేయగా కూటమి ప్రభుత్వం మౌనంగా ఉండడం తగదన్నారు. అదేవిధంగా ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయరాదని, దీనితో పేద విద్యార్థులు మెడిసిన్ చదివే అవకాశాన్ని కోల్పోతారన్నారు. ప్రభుత్వం వెంటనే వైద్య విద్యను ప్రైవేటుకరించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి గోరుముచ్చు రవి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ప్రభాతం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్‌టిఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ నిర్వహణలో నూతనంగా ఏర్పాటు చేసిన రిలాక్స్ మసాజ్ సెంటర్‌ను ప్రతి ఒక్కరు ఆందరించాలని స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎస్‌బిఐ సమీపంలో ఏర్పాటు చేసిన ఫుల్ బాడీ మసాజ్ సెంటర్ యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్టణాలలో ఉండే ఆరోగ్య మసాజ్ సెంటర్ ఇప్పుడు మన గుడివాడ పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డా॥ గోర్జి సత్యనారాయణ, చేకూరి జగన్‌మోహనరావు, వసంత వాడ దుర్గరావు, పొట్లూరి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.





నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ఉపాధ్యాయులు శ్రీనివాసరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అవనిగడ్డ ప్రాజెక్ట్ ఏరియా నాయకురాలు అన్నపరెడ్డి నాగమణి భర్త, ఉపాధ్యాయులు యాసం శ్రీనివాస రావు (60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సిపిఎం, సిఐటియు, అంగన్వాడి, ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు అవనిగడ్డలో శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగమణిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం. పోలి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు యండి కరిముల్లా, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ, అంగన్వాడి ఆశ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ ఏరియా కార్యదర్శి నిర్మల జ్యోతి, సిపిఎం అవనిగడ్డ మండల పార్టీ నాయకులు గొరిపర్తి శ్రీనివాసరావు, పాల్గొన్నారు. అదేవిధంగా సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు కూడా శ్రీనివాసమూర్తి సంతాపం తెలిపారు. కాగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైసిపి సీనియర్ నాయకులు కడవకొల్లు నరసింహారావు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు నివాళులర్పించారు. మరణించిన శ్రీనివాసరావుకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

మద్యంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంకిపాడు : వైసీపీ నాయకులు కూటమి ప్రభు త్వంపై అసత్యాలు ప్రచారం చేస్తూ, తమ పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్ని స్తున్నారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మద్యం దుకాణాలలను ఆయన శుక్రవారం పరిశీలిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మద్యం దుకాణా లలో, బార్ షాపులలో విక్రయించే మద్యం సీసాలపై సాంకేతికతతో రూపొంచించిన క్యూర్ కోడ్ ద్వారా మద్యం తయారీకి సంబంధించి పూర్తి వివరాలు తెలియ జేస్తున్నట్లు తెలిపారు. ఎవరైతే నకిలీ మద్యం తయారీలో భాగస్వాములుగా ఉన్నారో వారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



మద్యం షాపును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాదు

ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యువతకు ఉచితంగా 'ఆఫీస్ అసిస్టెంట్' కోర్సులో శిక్షణ అందించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభ మవుతుందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు 949 4005725 సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆటో, బైక్ ఢీ : 11 మందికి గాయాలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం మంగినపూడి బీచ్ రోడ్డు తపసపూడి గ్రామం వద్ద ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మందికి గాయలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రమాద చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన ముగ్గురును విజయవాడ తరలించారు. ఆటోడ్రైవర్ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు తెలిపారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెల 26వ తేదిన స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రమేష్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ పోతినేని రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేది ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లపై తమ హాస్పటల్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఈనెల 26 ఆదివారం గుడివాడ వాకర్స్ అసోసియేషన్ సహకరంతో వాక్‌థాన్, సిపిఆర్ శిక్షణ, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్తా కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఐఎంఏ గుడివాడ అధ్యక్షులు డా॥ మాగంటి శ్రీనివాస్‌లు పాల్గొంటారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

బాలోత్సవం వాయిదా

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలో ఈనెల 25,26 తేదీలలో జరగాల్సిన బాలోత్సవం వాయిదా వేసినట్లు బాలోత్సవం అధ్యక్షులు సనకా సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వర్షాల ప్రభావంతో వాయిదా వేశామన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కార్పోరేటు విద్యాసంస్థలు అందరూ గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం సభ్యులు సమరం, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలోత్సవం సభ్యులు

కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మించాలి : సిపిఎం



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ పశ్చిమ నగర ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం 45వ డివిజన్ కొండ బడి ఎదురు కొండ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను సత్యబాబు దష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల ప్రజలపై పన్నుల భారాలు మోపడంపై చూపిస్తున్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలో చూపాలని విఎంసి అధికారులను డిమాండ్ చేశారు. నగరంలో కొండ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల ప్యాకేజీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా నగరంలో కొండ ప్రాంతాల సమస్యలపై అధ్యయనం యాత్రలు నిర్వహించాలని తెలిపారు. పశ్చిమ నగర సమస్యల పరిష్కారానికి ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా ఈ 27న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 45వ డివిజన్ పర్యటనలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎండి మస్తాన్, డివిజన్ కార్యదర్శి ఎ శ్రీనివాస్, సిపిఎం నాయకులు అప్పలరాజు, సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు పశ్చిమ నగర అధ్యక్షులు ఎస్ కృష్ణ, కొండ ప్రాంతాల అభివద్ధి కమిటీ నాయకులు ప్రభు కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో మంజుల ప్రతిభ



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నర్సుల విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ మంజుల దేవి రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ చూపారు. పోటీలకు సంబంధించి వివిధ విభాగాలలో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంజులను శుక్రవారం పలువురు అభినందించారు. గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కెఆర్ సూర్యనారాయణ, జనరల్ సెక్రెటరీ కె రమేష్ బాబు, ఆర్‌టిసి విభాగం నుండి కేదార్ రావు అభినందించారు.

డీసిల్టింగ్ పనులు వేగవంతం చేయాలి



ప్రజా శక్తి - విజయవాడ సిటీ : ఔట్ ఫాల్ డ్రైన్లలో డీసిల్టింగ్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వేముల శ్యామలాదేవి వీధి, ఘంటసాల మ్యూజిక్ కాలేజ్ రోడ్డు, కొత్త వంతెన, బిఆర్టిఎస్ రోడ్, ఎర్రకట్ట, కెఎల్ రావు రోడ్, కలరా హాస్పిటల్, కెటి రోడ్, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, ఔట్ ఫాల్ డ్రైన్లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ఔట్ ఫాల్ డ్రైన్లలో ఉన్న వ్యర్థలను ఎప్పటికప్పుడు తొలగించాలని, నీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకుండా డీజిల్టింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్ అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గమ్మకు బ్యాటరీ వాహనాలు బహూకరణ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి విజయవాడ వన్‌టౌన్ బ్రాంచ్ కరూర్ వైశ్యా బ్యాంక్ సిబ్బంది రూ.18.36 లక్షల విలువైన రెండు ఎలక్ట్రానిక్ బ్యాటరీ వాహనాలను విరాళంగా అందజేశారు. శుక్రవారం కరూర్ వైశ్యా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ నెరల్లా రమేష్ బ్యాంకు సిబ్బందితో కలిసి బ్యాటరీ వాహనాలను ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్‌కు అప్పగించారు. పూజా కార్యక్రమాల అనంతరం దుర్గగుడి చైర్మన్, ఈవో రెండు బ్యాటరీ వాహనాలకు జెండా ఊపి యాత్రికులకు అంకితం చేశారు.

వ్యాధుల నివారణకు 'ఫ్రైడే డ్రై డే'



ప్రజాశక్తి-విజయవాడ : ఫ్రైడే డ్రైడే పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా ఆంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బయోలజిస్ట్ కామేశ్వరరావు, మలేరియా సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన



ప్రజాశక్తి- గంపలగూడెం: పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ నిర్వహించినట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసు విధుల గురించి వివరించారు. రివాల్వర్, స్టేషన్లో వినియోగించు పలు రికార్డులపై అవగాహన కల్పించారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ

రోడ్లపై చెత్త వేస్తూ...శానిటేషన్ సమస్యకు కారణమయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సర్కిల్-1 కార్యాలయం కలరా హాస్పిటల్లో శుక్రవారం మొబైల్ కోర్టు జరిగింది. 8వ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ గోలి లెనిన్‌బాబు శానిటరీ ఇనిస్పెక్టర్లు నమోదు చేసిన 26 కేసులపై విచారణ చేసి, వారికి రూ.10,710 జరిమానా విధించారు. మరోసారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వారిని న్యాయమూర్తి హెచ్చరించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేసినా, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినా, రోడ్లపైన పెంపుడు జంతువులను ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నా వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్-1 డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు సోమరాజు, శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఆనంద్ కపాల్, కృష్ణ, శామ్యూల్ పాల్గొన్నారు.

కళలు, సంస్కృతులను కాపాడుకోవాలి

- సమగ్ర శిక్ష ఎస్‌పిడి శ్రీనివాసరావు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులకు చదువుతో పాటు కళలు, సంస్కృతుల పట్ల ఆసక్తికనబరచాలని, మన సంస్కృతీ సంప్రదాయాలను, కళలను కాపాడుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ మురళీ రిసార్ట్సులో రెండు రోజులపాటు జరిగిన 'కళా ఉత్సవ్ -2025' ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీడీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనతో పాటు సహపాఠ్యాంశ (కోకరిక్యులర్) కృత్యాల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఒక జాతి సంస్కృతి, విలువలు, సంప్రదాయాలు ఒక తరం నుండి మరొక తరానికి అందించబడతాయని, ఈ కళా సంస్కృతిని నిరంతరం ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 345 మంది విద్యార్థులు 12 రకాల కళారూపాలతో పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శైల కల్పన, ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్లు, సమగ్ర శిక్ష, దీక్ష సిబ్బంది, స్టేట్ ఏఎంవోలు పాల్గొన్నారు..



గుర్తింపుకార్డులు విధిగా పొందాలి

- వీధివిక్రయదారులతో విఎంసి కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : వీధి విక్రయదారులు (చిరు వ్యాపారులు) విధిగా గుర్తింపుకార్డులు, వెండింగ్ సర్టిఫికెట్స్‌ను పొందాలని విఎంసి కమిషనర్, టౌన్ వెండింగ్ కమిటీ చైర్మన్ ధ్యానచంద్ర కోరారు. మునిసిపల్ కమిషనర్, టౌన్ వెండింగ్ కమిటీ చైర్మన్ ఛాంబర్‌లో పట్టణ వీధివిక్రయదారుల కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ... వీధి విక్రయదారుల సంక్షేమం కోసం గుర్తింపుకార్డులు, వెండింగ్ సర్టిఫికెట్స్ తప్పని సరిగా పొందాలని కోరారు. విజయవాడ పట్టణంలోని మెప్మా రిసోర్స్ పర్సన్స్ ద్వారా సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేలో నమోదు కాబడిన వీధి విక్రయదారులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికేట్ పొందడానికి రుసుము రూ.200లు చెల్లించాలన్నారు. పట్టణం వ్యాప్తంగా గ్రీన్, అంబర్, రెడ్ జోన్ లుగా మార్కింగ్ చేసిన జోన్లను జోనల్ కమీషనర్ల సమక్షంలో వివిధ స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించి జోన్ల తుది జాబితా తయారు చేయాల్సి ఉందన్నారు. పిఎం స్వానిధి 2.0 కార్యక్రమం క్రింద ప్రతి నెల లోక కళ్యాణ మేళ నిర్వహించి వీధి విక్రయదారులందరికి కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులకు బ్యాంకు రుణాలు మొదటి సారిగా రూ.15 వేలు, రెండవసారి రూ.25 వేలు, మూడవసారి రూ.50 వేలు త్వరితగతిన మంజూరు చేయించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ వివిఎన్‌డివిఎస్ మూర్తి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, టౌన్ వెండింగ్ కమిటీ కన్వీనర్, ప్రాజెక్టు ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కె. ప్రియాంక, బ్రాంచ్ మేనేజర్ ఎం.సుధాకర్, వీధి వ్యాపారస్తులు మూర్తిరావు చిపడ, వడ్లమూడి శ్రీనివాస్, నాగ వెంకట బాలకృష్ణ, షేక్ సబీర్, బొమ్మిసెట్టి జగన్మోహన్ రావు, కంకిపాటి రత్నకుమారి, పిల్లి నాగమల్లేశ్వరి, పాల్గొన్నారు.

వైసిపి 'ప్రజా ఉద్యమం' పోస్టర్ల ఆవిష్కరణ



విజయవాడ సిటీ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న వైసిపి చేపట్టనున్న ప్రజా ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పలుచోట్ల ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. విజయవాడ బ్రాహ్మణ వీధిలోని వైసిపి పశ్చిమ కార్యాలయంలో వైసిపి పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పశ్చిమలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, దానిలో భాగంగానే ఈ నెల 28న భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుండి పాదయాత్రగా ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి 54వ డివిజన్ వైసిప నేతలు షేక్ హస్సన్ భాషా, సయ్యద్ అతిక్ ప్రజా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తిప్పికొట్టేందుకు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. **తిరువూరు :** తిరువూరు పట్టణంలోని ఒకటవ వార్డులో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ఉద్యమం గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నంలోని వైసిపి కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు ప్రైవేట్ కాలేజీలను కట్టబెడుతున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. **నందిగామ :** నందిగామ నియోజకవర్గంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు ప్రజా ఉద్యమం పోస్టర్లను మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ మొండితోక జగన్మోహనరావు విడుదల చేశారు.

భారీ వర్షంతో ఇబ్బందులు



అవనిగడ్డలో రోడ్డుపై వర్షపు నీరు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో శుక్రవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. దీంతో ఆవనిగడ్డలోని ప్రధాన రహదారులన్నీ జలమయం కావడంతో పాటు, లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఉదయం 8:30 గంటల నుండి 9:30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో రోడ్లపై నీళ్లు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నాన్న అవస్థలు పడ్డారు. కాగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వర్షపు నీరు చేరగా... దానిని యుద్ధ ప్రాతిపదికన పంచాయతీ వారు తొలగించే చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆదేశాలతో ముప్పు సమస్య రాకుండా అధికారులు డ్రైనేజీలు పూడిక చేయిం చారు. సీతా లంకలోని ప్రభుత్వ బాలుర బిసి వసతి గహాన్ని ఎంపీపీ తుంగల సుమతి దేవి, ఎంపీడీవో ఎం మరియా దేవి, ఈవో తోట శ్రీనివాసరావు పరిశీలించి వసతి గహం వద్ద డ్రైనేజీని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పూడిక పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. అదే విధంగా అవనిగడ్డ శివారు కొత్తపేట జనసైనికులు మరోసారి గ్రామం కోసం శ్రమదానం చేశారు గ్రామంలో శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు అంతర్గత రహదారులన్నీ జలమయం కావడంతో రాకపోకలకు అసౌకర్య ఏర్పడింది. దీనితో ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, గ్రామ సైనికులు కలసి జెసిబితో కచ్చా డ్రైనేజీ పూడిక తీయించారు.

మోపిదేవిలో రహదారులు జలమయం

ప్రజాశక్తి-మోపిదేవి : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మోపిదేవిలో రహదారులు జలమ యమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లపై నీరు ఎక్కడెక్కడే నిలిచిపోయింది. మండల పరిధిలో వరి చేలలో నీరు చేరడంతో రైతులు దిగాలు పడుతున్నారు.



బందరులో ఇంకా రోడ్డుపైనే నిలిచిన వర్షపునీరు

బందరులో తొలగని వర్షపునీరు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నంలో గురువారం కురిసిన వర్షానికి మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు తొలగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్ లోకి నీళ్ల వెళ్లి మొరాయిస్తున్నాయి. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లు పొంగి పొర్లుతూ జలాశయాలను తలపిస్తున్నాయి. శుక్రవారం రాత్రి బస్టాండ్ సమీపంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ముందు మెయిన్ రోడ్ లో వర్షపు నీరు లో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. యుద్ధ ప్రాతిపదికన మచిలీపట్నంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

27 నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా ఉంగుటూరు మండలంలో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎపిఒ టి. వినీల తెలిపారు. ఈనెల 27 నుండి 30వ తేదీ వరకు వివిధ గ్రామ పంచాయతీల్లో ఈ తనిఖీలు జరుగుతాయన్నారు. ఈనెల 27న నందమూరు, వెల్దిపాడు, ఉంగుటూరు గ్రామాలలో, 28న ఎలుకపాడు, చికినాల, చాగంటిపాడు, వెన్నూతల, పొణుకుమాడు, ఆముదాలపల్లి, తుట్టగుంట, ఇందుపల్లి, మధురపాడు, నారయ్యఅప్పారావుపేట గ్రామాలలో, 29న గారపాడు, పొట్టిపాడు, కొయ్యగూరుపాడు, మొక్కపాడు, వేమండ, నాగవరపాడు, లంకపల్లి అగ్రహారం గ్రామాలలో, 30న ఆత్కూరు, బోకినాల, పెద్దఆవుటపల్లి, తరిగొప్పల, మానికొండ, తేలప్రోలు, వేమండ గ్రామాలలో సామాజిక తనిఖీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లోనే నిర్వహిస్తామన్నారు. జాబ్ కార్డులు, పని ఆర్డర్లు, ఇతర పత్రాలు సరిచూసుకోవడం, పథకం ప్రయోజనాలు సక్రమంగా లభించడం నిర్ధారించుకోవడమే ఈ తనిఖీల ప్రధాన లక్ష్యమన్నారు.






లెక్కించిన సొమ్ముతో దేవాదాయశాఖాధికారులు

కొండలమ్మ దేవస్థానం హుండీ ఆదాయం రూ.18,66,590

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి అరుణ పర్యవేక్షణలో శ్రీ అమ్మ వారి దేవస్థాన చైర్మన్ శ్రీ ఈడే మోహన్ , ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో తెరిచి లెక్కించారు. మొత్తం 39 రోజులకు నోట్లు ద్వారా రూ.16,81,420లు చిల్లర ద్వారా రూ.1,85,170లు వెరసి మొత్తము రూ.18,66,590లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది, మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్, రేపల్లి, వుయ్యూరు సేవా సమితి వారు తదితరలు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దృశ్యం

మోపిదేవి ఆలయంలో నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకానికికష్ణాజిల్లా, విజయవాడకు చెందిన జి. శ్రీనివాసరావు, హిమబిందు దంపతులు 1,11,116 రూపాయల ఆలయ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కళాంజలి పాఠశాల భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పెడన పట్టణంలో దశాబ్దాల పాటు విద్యారంగంలో కళాంజలి పాఠశాల యాజమాన్యం విశేష సేవలందించడం ఆదర్శనీయమని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల నూతన భవన ప్రాంగణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల మీద కూడా పట్టు సాధించాలన్నారు. విద్యార్థుల తమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. 24 సంవత్సరాల పైబడి విద్యా రంగలో కృషి చేస్తున్న కే దిలీప్ కుమార్ ప్రసన్న లక్ష్మి దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. కళాంజలి ప్రిన్సిపల్ కే. దిలీప్ కుమార్, పెడన ఎం.ఈ.ఓ- 1 సలోమి , పెడన టిడిపి అధ్యక్షులు ఎక్కల శ్యామలయ్య , టిడిపి సీనియర్ నాయకులు హన్ను , 12వ వార్డు కౌన్సిలర్ శివ పావని , అప్స కష్ణా జిల్లా అధ్యక్షులు గౌరీ ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లాస్థాయి డ్రాయింగ్ కాంపిటీషన్లో రెండో ద్వితీయ బహుమతి సాధించి కలెక్టర్ బాలాజీ చేతులమీదుగా బహుమతి అందుకున్న ఆర్. శివ సాయి ప్రసన్నను, సేవ్ గర్ల్ చైల్డ్ అంశంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించి జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా బహుమతి అందుకున్న బి. మల్లికలను ఎంఎల్ఎ కృష్ణ ప్రసాద్ అభినందించారు.



స్కూలు నూతన భవనం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కృష్ణప్రసాదు

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లకు అభినందనలు

ప్రజాశక్తి-పామర్రు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గహ నిర్మాణ కార్యాలయంలో నూతనంగా హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన ప్రియ సౌజన్య, లింగమనేని రామలింగేశ్వరరావులను పామర్రు నియోజకవర్గం శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా,పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ లు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపర్ల ఎంపీటీసీ సభ్యులు కోనపరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షం నీరు

ప్రజాశక్తి-పామర్రు : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా పామర్రులోని మండల రెవెన్యూ కార్యాలయం, దాని పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ కార్యాలయాలు వర్షం నీటితో నిండిపోయాయి. రెవెన్యూ కార్యాలయం ప్రాంగణం పూర్తిస్థాయిలో నీటిలో మునిగిపోయి కార్యాలయంలోనికి కూడా నీరు చోచుకొచ్చాయి. గురువారం మోకాలు లోతు నీళ్లలో రెవెన్యూ సిబ్బంది తమ విధులను నిర్వర్తించారు. వాస్తవానికి ఏళ్ల తరబడి నుండి ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు రెండేళ్ల క్రితం కార్యాలయ లోపల భాగం అడుగుమేర మెరక చేయిం చారు. ఆ చర్య కొంతమేరకు ఉపశమనం కలిగించిన భారీ వర్షం కారణంగా కార్యాలయ లోపల భాగం నీటితో నిండిపోయింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ రెవెన్యూ కార్యాలయానికి సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.



తహశీల్దార్ కార్యాలయంలోకి వచ్చిన వర్షపు నీరు



నీటిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

చెస్ పోటీలకు 'సెయింట్ మేరీస్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కంకిపాడు : స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉయ్యూరు డివిజన్ చెస్ పోటీల్లో కంకిపాడుకు చెందిన సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి, జిల్లాస్థాయి కి ఎంపికయ్యారు. విజేతలు సతీష్ కుమార్, పి పార్థవి సాయి, సీమసాధ్య, టి ప్రణీత లను ప్రిన్సిపాల్ సిస్టర్ చిత్ర, హెచ్ మువ్వల సాల్మన్ రాజు సన్మానించారు.

వసతి గృహాల్లో విద్యార్థుల సంరక్షణపై శ్రద్ధవహించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : సంక్షేమ వసతి గృహాలను బాధ్యతగా నిర్వహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శుక్రవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ బీసీ సంక్షేమ వసతి గృహ అధికారుల సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు మండలాల్లోని బీసీ వసతి గహాల్లో మౌలిక సౌకర్యాలు, పరిస్థితులపై ఎమ్మెల్యే సమీక్షించారు. వసతి గృహాల్లో జరుగుతున్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వసతి గహాల్లో కి నీరు చేరకుండా డ్రైనేజీలు పూడిక తీయించాలని ఎంపీడీవోలకు సూచించారు. వసతి గహాల్లో పిల్లలను అధికారులు, తమ సొంత బిడ్డల చూసుకోవాలని, వారి వ్యక్తిగత భద్రత, ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవోలు మరియాదేవి, సుధా ప్రవీణ్, వసతి గహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



చెస్‌లో రాణించిన నారాయణ విద్యార్థి



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెడ్డిగూడెం నారాయణ హైస్కూల్ విద్యార్థి కొప్పర్తి అభి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ వి.రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది గురువారం అభినందించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లైమేట్ చేంజ్ యాక్షన్ సందర్భంగా ప్రకతి ది ఎన్విరాన్మెంటల్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ పర్యావరణంలో జీవ వానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించి పరిమాణంలో ఉన్నాయన్నారు. దీనివల్ల ప్రతిచోట వీటి సాంద్రత పెరిగి పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి రమేష్ రెడ్డి, ప్రకృతి క్లబ్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి ఎ.కొండూరు మండల అధ్యక్షునిగా గనియా



ప్రజాశక్తి-ఎ.కొండూరు : వైసిపి ఎ.కొండూరు మండలం నూతన అధ్యక్షునిగా రెండవసారి భూక్యా గనియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో చీమలపాడు సర్పంచ్‌గా, ఎంపిపిగా పని చేశారు. ప్రస్తుతం జడ్‌పిటిసిగా కొనసాగుతున్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాసుకు, ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్‌కు, తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు మొదుగు వేణుగోపాల్ రెడ్డికి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు వైవి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

చేతుల పరిశుభ్రత శ్రేయస్కరం

ప్రజాశక్తి-గంపలగూడెం: పలుమార్లు చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల మన ఆరోగ్యాన్ని మెరుగుపరచు చుకో వచ్చుని గంపలగూడెం ఎంఈఓ పివిడిఎల్ నరసింహారావు పేర్కొ న్నారు. శుక్రవారం హ్యాండ్ వాష్‌డే



కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్, యూనిసెఫ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పివిడిఎల్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిబేట్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ముందుగా ఎంపీడీవో సరస్వతి, తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, సిడిపిఒ సత్యవతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఇంచార్జ్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి-వీరులపాడు : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం వీరులపాడులో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశంతో సహ ప్రపంచ దేశాలన్నిటిపైన తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. వ్యవసాయ రంగం దెబ్బతిందని తెలిపారు. ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. దాంతో ఉద్యోగులు, కార్మికులు, రైతులు రోడ్డునపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాల్ని, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారు నోరుమెదపడం లేదని ఆరోపించారు. రాష్ట్ర



ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు స్వామి, గడ్డం ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు పార్థసారధి, రమేష్, కోడూరు పిచ్చేశ్వరావు, కొండూరు ప్రభాకర్, సిపిఐ నాయకులు వట్టికొండ చంద్రమోహన్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు

రేషన్ షాపులు తనిఖీ

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేటలో తహశీల్దార్ కె.లక్ష్మి కళ్యాణి ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి నాగరాజు, ఆర్ఐ సుజాత, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి మండల కార్యదర్శిగా వేణుబాబు



ప్రజాశక్తి-గంపలగూడెం: వైసిపి మండల కమిటీ సెక్రటరీగా కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరకొప్పు వేణుబాబు నియమితులు య్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుండి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవికి సహకరించిన తిరువూరు ఇంచార్జ్ నల్లగట్ల స్వామి దాసుకు కృతజ్ఞతలు తెలిపారు.

నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



ప్రజాశక్తి- నందిగామ : పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సిఐ నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో జరిగే కార్యక్రమాల గురించి విద్యార్థులకు పోలీసులు వివరించారు. జైలు, సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, గన్, కమాండ్ కంట్రోలింగ్ వ్యవస్థ తదితర వాటి పనితీరు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ సూర్య, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి జగ్గయ్యపేట: ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా వాగ్దేవి మహిళా కళాశాల బిఎస్సీ డిగ్రీ, నర్సింగ్ విద్యార్థులు శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, నర్సింగ్ కళాశాల ఫ్యాకల్టీ ఈశ్వరి, సింధు, నాగమణి, వాగ్దేవి కళాశాల చైర్మన్ బుస్సా సురేష్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ మృతి



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది సుంకర సూర్యనారాయణ(97) శుక్రవారం మతి చెందారు. సూర్య నారాయణ కు భార్య, పిల్లలు ఉన్నారు. సూర్య నారాయణ మతదేహానికి న్యాయవాదులు నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులు , సూర్య నారాయణతో ఉన్న స్నేహ బంధాన్ని గుర్తు చేసుకున్నారు. నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, ఉపాధ్యక్షులు వరదబోయిన విజయ్ కుమార్, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నేపాక సుందరరావు తదితరులు సూర్యనారాయణకు నివాళులర్పించారు. సుంకర సూర్యనారాయణ భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు సందర్శించి, పూలమాల వేసి నివాళి అర్పించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ప్రజాశక్తి-వత్సవాయి : డిసెంబర్ నెలలో కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ ఎన్ఎంఎంఎస్‌కు సిద్ధమయ్యే 20 మంది వత్సవాయి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సౌజన్యంతో శుక్రవారం అందజేశారు. విద్యార్థులు చక్కగా చదివి మెరిట్‌స్కాలర్షిప్‌ను సాధించాలని యుటిఎఫ్ ప్రతినిధులు పులి శ్రీనివాస్ రావు, రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు కాకాని శ్రీనివాసరావు, అద్దంకి సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని జేఆర్సి కళాశాలలో విద్యార్థులకు జాతి నిర్మాణంలో పోలీసుల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జగ్గయ్యపేట ఎస్సై రాజు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు.

పశువులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలం చిట్యాల గ్రామ శివారు సింగవరంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 35 మంది పశుపోషకులు హాజరై 70 వరకు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి నందిగామ ఉపసంచాలకులు డాక్టర్ మోజెస్ వెస్లీ, జగ్గయ్యపేట ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ భవాని ప్రసాద్, డిఎల్‌డిఏ డాక్టర్ హరిత, వత్సవాయి మండలం పశువైద్యులు డాక్టర్ ఠాగూర్, డాక్టర్ ఉదయ్ శంకర్, డాక్టర్ శీను నాయక్, పశు సంచార సేవ వైద్య విభాగం డాక్టర్ జాహ్నవి, పారా సిబ్బంది, సర్పంచ్ పొన్నవోలు ప్రశాంతి, పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - తిరువూరు : కార్తీక మాసం సందర్భంగా తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఇన్చార్జి డిపో మేనేజర్ నాగ మల్లేశ్వరరావు తెలిపారు. అన్నవరం, శ్రీశైలం, పంచారామాలైన అమరావతి, భీమవరం, పాల కొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు ఈ బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో అన్నవరంకు సాయంత్రం 6 గంటలకు, శ్రీశైలంకు సాయంత్రం 7 గంటలకు, పంచారామాలకు రాత్రి 10 గంటలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. అరుణాచలంకు కార్తీక పౌర్ణమికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కూడా ప్రత్యేకంగా బస్సు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈ బస్సులకు ఆర్టీసీ బస్టాండులో లేదా ఆన్లైన్లో టికెట్లు ముందుగా బుక్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు7382487969, 9885661835 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - తిరువూరు :స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, ఈ నైపుణ్యాలను కలిగినవారే పోటీలో నిలదొక్కుకుంటారని మై కెరీర్ టెక్నాలజీస్ టెక్నికల్ హెడ్ భవానీ ఈశ్వర్ తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్‌పై విద్యార్థులు దృష్టి పెట్టాలని, ఏఐ టెక్నాలజీని అవగాహన చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ జానీ సతీమణి షేక్ జహారాబి (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. జహారాబి మృతదేహాన్ని గ్రామ మాజీ ఎంపిటీసీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు పర్వతనేని చంద్రమోహన్, సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి మట్టి ఖర్చుల నిమిత్తం సర్పంచ్ నాగమల్లేశ్వరి చంద్రమోహన్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరం : సామినేని


ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కర్నూలు బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు జనసేన పార్టీ తరపున తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. పమాదంలో రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన బాధితులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం వెల్లడించిందని పేర్కొన్నారు.

గోకులం షెడ్లతో రైతులకు ప్రయోజనం : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రైతుల, పశువుల అభివృద్ధి కోసం చేపట్టిన గోకులం షెడ్లతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. 2018-19 సంవత్సరంలో మెగా గోకులాల పేరిట నిర్మాణం చేపట్టిన సామాజిక పశువుల షెడ్లలను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగ్గయ్యపేట మండలం బండిపాలెం, పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయి గూడెంలలోని సామాజిక పశువుల షెడ్లను (కమ్యూనిటీ క్యాటిల్ షెల్టర్) జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు సామాజిక పశువుల షెడ్ల నిర్మాణాన్ని గతంలో చేపట్టారని, అవి వివిధ స్థాయిల్లో ఉన్నాయని తెలిపారు. నాడు మెగా గోకులం పేరిట ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.21 లక్షలతో ప్రతిపాదనలు పంపారన్నారు. వసతిలేని పాడి రైతులకు ప్రయోజనం కలిగించాలన్న ఉద్దేశ్యంతో వీటి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. వీటిని సక్రమంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీటిని పశువసతి కేంద్రం (కాటిల్ హాస్టల్)గా అభివృద్ధి చేసి వసతితో పాటు పశువులకు అవసరమైన మేత, దాణా కూడా సమకూర్చాలన్నారు. వ్యవసాయంతో పాటు పాడి కూడా ఉండాలని, అప్పుడే రైతు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ గంద్రాయిలో సామాజిక పశువుల చావిడి (కమ్యూనిటీ క్యాటిల్ షెల్టర్) నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. డొంక రోడ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దష్టికి తీసుకురాగా డొంక రోడ్లను వేయిస్తామని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ చెప్పారు. సుబ్బాయిగూడెంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి పశువ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, డ్వామా పీడీ రాము, జగ్గయ్యపేట ఎంపీడీవో జి.నితిన్, పెనుగంచిప్రోలు ఎంపీడీవో శ్రీను, ఏపీడి లక్ష్మి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్వాతంత్రో ద్యమంలో వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తి వడ్డెర్ల ఐక్యతకు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిందని పలువురు వక్తలు తెలిపారు. జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు గ్రామంలో వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. వడ్డే ఓబన్న విగ్రహా విష్కరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, శ్రీరామ్ చిన్నబాబు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో రేనాటి ప్రాంతంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి అంగ రక్షకుడిగా, సైన్యాధ్యక్షుడిగా సేవలందించిన వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. బ్రిటీష్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన యోధుడు వడ్డే ఓబన అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి వడ్డెర్లలో ఐక్యతకు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ చైర్మన్ వడ్డే వెంకట్ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్లూరి పార్వతి, చిల్లకల్లు గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28న ర్యాలీలు

ప్రజాశక్తి - గుడివాడ : మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో ఈ నెల 28న ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైసిపి కార్యాలయంలో వైసిపి నాయకుల ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొర్ల శ్రీను మాట్లాడుతూఈనెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలేటి చంటి, చుండూరి శేఖర్, కొంకితల ఆంజనేయప్రసాద్, దుడ్డు చిన్న, షేక్ సయ్యద్, ఎస్కే అలీ సాహెబ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పేద విద్యార్థుల భవిష్యత్తుకు వైసిపి అండగా ఉంటుందని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో "వైసిపి ప్రజా ఉద్యమం" పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్ పాల్గొన్నారు.

కోటిసంతకాల సేకరణ

ప్రజాశక్తి...తోట్లవల్లూరు : మండలంలోని తోట్లవల్లూరు గ్రామంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొని ప్రస్తుత టిడిపి పాలనను విమర్శించారు .పేద ప్రజలకు విద్య వైద్యం అందుబాటులోకి తేవాలన్న ఒక మంచి ఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం అంటే దానికి అనుసంధానంగా ఏర్పడే బోధనాసుపత్రులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడం కిందకే వస్తుందన్నారు. పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను దూరం చేయాలన్న దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ కుట్రలకు తెరతీసిందన్నారు. గ్రామ సర్పంచి పెనుమత్స రాధిక, ఎంపీపీ ఈడుపుగంటి రాజమణి,మాజీ ఎంపీపీ కళ్ళ వెంకటేశ్వర రెడ్డి,గొరిపర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు.

గుండెపోటుతో స్కూలుకు వెళుతూ విద్యార్థి మృతి



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గుండెపోటుతో విద్యార్థి మృతి చెందిన సంఘటన పట్టణంలోని కాగితాల బజార్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గోలి వెంకట గణేష్ (15) ఉదయం ఏడు గంటల సమయంలో పాఠశాలకు సైకిల్ పై వెళ్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. విద్యార్థి తండ్రి రామారావు గతంలోనే మరణించాడు. తల్లి శిరీష షాపులో గుమస్తాగా పని చేస్తున్నారు. సోదరి లక్ష్మీనవ్య 7వ తరగతి చదువుతుంది. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) విద్యార్థి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావుతో 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాలుని కుటుంబ సభ్యులకు పద్మశాలి పెద్దలు అల్లి కిశోర్, మెటికల శ్రీనివాసరావు కలిసి అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో గోపాలకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రైతుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల శ్రమకు సరైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గౌరవరం సొసైటీ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, జగ్గయ్యపేట ఎల్ఎస్‌సిఎస్ చైర్మన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు, జగ్గయ్యపేట సొసైటీ చైర్మన్ యానాల గోపీచంద్, కాచవరం కెనాల్ చైర్మన్ కానూరి కిషోర్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు అందజేత

ప్రజాశక్తి-విస్సన్నపేట: విసన్నపేట మండల పరిధిలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ విస్సన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో (సర్వీస్ రిజిస్టర్లు) సేవ పుస్తకాలు అందజేశారు. వేమిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ నాయకులు ఈ సేవ పుస్తకాలను అందించారు. యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిలర్ పి రామకృష్ణారెడ్డి, నాయకులు ఎం బాలరాజు, తిరుపతయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-వత్సవాయి : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న సంఘటన మండలంలోని పోలంపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలంపల్లి నుండి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో పోలీలు మాటువేసి రాత్రి రెండు గంటల సమయంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌పై నమోదు చేసినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన 11 మంది ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. వారి వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకొని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సిఫారస్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా సిఎం సహాయ నిధి నుంచి 11 మందికి మొత్తం 3,43,234 రూపాయల సాయం మంజూరైంది. ఈ సాయం చెక్కులను ఎమ్మెల్యే రాజగోపాల్ శుక్రవారం చిల్లకల్లు గ్రామంలో పర్యటించి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రావూరి విశ్వనాథం, కారుపాటి డేవిడ్, ముత్తినేని అశోక్, రావూరి శ్రీనివాసరావు, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరరావుకు పలువురు అభినందనలు



ప్రజాశక్తి- మొవ్వ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన కృష్ణాజిల్లా లోని మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావును మొవ్వ మండల తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు. విజయవాడ ఆటోనగర్ ఏపీఐఐసీ కాలనీలోని నిర్మన్ భవనంలో బాధ్యతలు చేపట్టిన ఆయనను మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వీరంకి తులసీదాస్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు జొన్నలగడ్డ సామ్రాజ్యలక్ష్మి, నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు జొన్నల గడ్డ రాజేంద్రప్రసాద్, నాయకులు గొంతు పులి వెంకటేశ్వరరావు, గొర్రెపర్తి వెంకటరమణ యాదవ్, జొన్నలగడ్డ సత్యనారాయణలు పూలదండలతో, పుష్పగుచ్చాలతో అభినందించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి - మొవ్వ : భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కొండేటి ఇందిర సూచించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామాలలో ముంపు సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఎంపీడీవో డి సుహాసిని మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను తన దష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రిపాలెం ఎంపీటీసీ కాకుమానుశ్రీలక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామ సమస్యలను సభాముఖంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులుసభ్యులు అప్పికట్ల ఇమ్మానియేల్, మాజీ ఎంపీపీ కాజా నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు తాతా నారాయణరావు వేదికపై పాల్గొన్నారు.



లూలూ సూపర్ మార్కెట్‌కు లీజు ప్రతిపాదన విరమించాలి



ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు) : మల్లవల్లి కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను లూలూ సూపర్ మార్కెట్‌కు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడాన్ని వెంటనే విరమించుకోవాలని పారిశ్రామిక క్లస్టర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కోర్ ప్రాసెసింగ్ యూనిట్ ను సందర్శించిన అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రైవేట్ సంస్థకు 66 సంవత్సరాలు (33 సంవత్సరాలు పొడిగింపు ఎంపిక) లీజుకు ఇవ్వడం తగదన్నారు. ఈ సెంటర్‌ను 77 కోట్ల రూపాయలతో 7.48 ఎకరాల్లో అధునాతన సదుపాయాలతో నిర్మించినప్పటికీ, దానిని ప్రైవేట్ సంస్థకు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం ప్రభుత్వ దుర్మార్గపు కుట్ర అని ఆయన ఆరోపించారు. 107.40 కోట్ల మూలధన పెట్టుబడి ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో ప్రభుత్వానికి సంవత్సరానికి కేవలం 0.46 శాతం లీజు మాత్రమే వసూలవుతున్నట్లు ఆయన వివరించారు. "ఈ కోర్ ప్రాసెసింగ్ సెంటర్ కోసమే రైతులను మోసం చేసి, 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి తీసుకున్నారన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని హామీ ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం అది చెల్లించడంలో విఫలమైందన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ పరిశ్రమ వస్తుందని, యువతకు ఉపాధి దొరుకుతుందని ఆశించారనీ, కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించడం వలన స్థానిక రైతులు, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న యువతను మోసం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా ఈ లీజు విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజనాల సురేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో 22 సూచికల్లో వంద శాతం ప్రగతి

- కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేస్తూ సమష్టి కృషితో ఆకాంక్షిత బ్లాకుల్లో సమగ్రాభివృద్ధికి కృషిచేయడం జరుగుతోందని.. ఇబ్రహీంపట్నం బ్లాకులో మొత్తం 40 సూచికలకుగాను 22 సూచికల్లో నూరు శాతం లక్ష్యాలను చేరుకున్నట్లు కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు తెలిపారు. ఆకాంక్షిత మండలమైన ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత కాచవరం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను కలెక్టర్ జి.లక్ష్మీశతో కలిసి సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం కేతనకొండలో సాక్షం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పోషకాహారం, కౌన్సెలింగ్, ఇతర మద్దతుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ప్రాంగణంలోని పోషణ వాటికను పరిశీలించి.. అందులో సాగుచేస్తున్న ఆకుకూరలను పరిశీలించారు. మూలపాడు జెడ్‌పీ హైస్కూల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి కెరీర్ పరంగా వారి ఆకాంక్షలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సబ్జెక్టు నైపుణ్యాలతో పాటు లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం కొండపల్లి బొమ్మల తయారీ విధానాన్ని పరిశీలించి బొమ్మల కళాకారులతో మాట్లాడారు. అనంతరం అశోక్‌బాబు ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయ వ్యవసాయ అనుబంధ సేవలు, మౌలిక వసతులు, సామాజిక అభివద్ధి ఇలా అయిదు ఇతివత్తాలకు సంబంధించి మొత్తం 40 సూచికలు ఉన్నాయని, ఈ సూచికల్లో ప్రగతిని ఎప్పటికప్పుడు మదిస్తూ, మెరుగైన ప్రణాళికలను అమలుచేస్తూ ముందుకెళ్లడం జరుగుతోందన్నారు. మొదటి దశ సంపూర్ణతా అభియాన్‌ను విజయవంతంగా ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలులో అమలు చేయడం జరిగిందని, ఇందులో ప్రగతికి ఫ్రంట్‌లైన్ సిబ్బందికి నీతి ఆయోగ్ బంగారు పతకాలు కూడా లభించాయన్నారు. త్వరలో సంపూర్ణతా అభియాన్ 2.0 కూడా ప్రారంభమవుతుందని, బ్లాకు కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఈవో యూవీ సుబ్బారావు, డీంఎహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, ఏబీపీ కోఆర్డినేటర్లు పి.శ్రీనివాస్, జి.మోహన్ సందీప్, ఎంపీడీవో డి.శకుంతల, తహశీల్దార్ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో పిబి సిద్ధార్థ విద్యార్థులకు బహుమతులు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి యువ జనోత్సవాల్లో జాన పదనృత్యం (బృందం), జానపద గీతాలాపన (బృంద) పోటీల్లో విజయవాడలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతులు గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, కల్చరల్ కమిటీ కో ఆర్డినేటర్ జయప్రకాశ్, సహాయాచార్యులు శ్రీమతి కోనేరు శివరంజని అభినందనలు తెలిపారు. ఆ మేరకు ఫోక్ డ్యాన్స్ గ్రూప్ అంశంలో పి.బి.సిద్ధార్థ విద్యార్థి విఘ్నేశ్ కార్తీక్ బందానికి, ఫోక్ సాంగ్ గ్రూప్ విభాగంలో సింధురాగేశ్వరి బందానికి కె.బి.ఎన్. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు ప్రశంసపత్రాలు అందచేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు : ఎస్ఐ జగదీష్



విజయవాడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సత్యనారాయణ పురం ఎస్ఐ జి జగదీష్ తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ సత్యనారాయణ పురంలోని ఎకెటిపి నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి జగదీశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం తీవ్రమైన ఆందోళనకరంగా మారుతోందని, ఇది మాదకద్రవ్యాలను ఉపయోగించే వ్యక్తికే కాకుండా, కుటుంబం, సమాజంపై కూడా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని తెలిపారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ.. ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోతారని, అది నేర ప్రవృత్తివైపు కూడా ప్రేరేపిస్తుందని తెలిపారు. నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె నజ్మా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావొచ్చని, నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన "బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగా సంప్రదించవచ్చని, వివరాలకు ఫోన్ నంబర్ 9490492020ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమర్ అలీ, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ దేవమని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌లో మార్పులేదు మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని, గత ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్‌కు ప్రజలు సరైన బుద్ధి చెప్పినా ఆయనలో మార్పు రాలేదని మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. శుక్రవారం తన నివాసంలో బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి డేటా సెంటర్ చంద్రబాబు తెస్తే... తన గొప్ప అని చెప్పడానికి జగన్‌కు సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఏరులై పారించిన చరిత్ర జగన్‌దే అని ఆరోపించారు. వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

కొలికపూడి వ్యాఖ్యలకు సౌమ్య ఖండన



ప్రజాశక్తి- నందిగామ : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి నంది గామ నియోజక వర్గాన్ని, ప్రజా ప్రతి నిధులను అన వసర వివాదాల్లోకి లాగడాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం తీవ్రంగా ఖండించారు. తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అసత్య ఆరోపణలతో అకారణంగా వివాదంలోకి లాగాలని ప్రయత్నించిన తీరు అభ్యంతరకరమని తెలిపారు. నిన్నటిదాకా 'నా దైవం' అంటూ కీర్తించిన ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని)పై నిందలు వేయడం సరికాదన్నారు. రాజకీయ అపరిపక్వతతో తన ఒంటికి అంటిన బురదను ఇతరులకు రుద్దాలని చూడడం సబబు కాదన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో నందిగామ ఎమ్మెల్యేగా నాకు, మా నియోజకవర్గానికి ఎలాంటి విభేదాల్లేవని, తమ మధ్య అత్యంత సమన్వయం ఉందని తెలిపారు. కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ సీనియర్ నాయకుడిగా, తనకు ఏర్పడిన సమస్యను రాజకీయ పరిణతితో, పార్టీ అధిష్ఠానం వద్ద చర్చించి, సామరస్యంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

విద్యార్థుల ఆలోచనలు సమాజాభివృద్ధికి దోహదపడాలి

- 'బ్లూమింగ్ డేల్'లో వైజ్ఞానిక ప్రదర్శనలో వక్తలు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : తరగతి గదిలో చెప్పిన పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా బయట ప్రపంచంలో చూసిన మార్పులు, సాంకేతికంగా వస్తున్న మార్పులను గమనిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు సృజనాత్మకతతో ప్రాజెక్టులు చేయాలనీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రిషాంత్ రెడ్డి అన్నారు. పెనమలూరులోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు ఎక్స్పో టెన్షియల్ పేరుతో వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా రిషాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పుస్తక పరిజ్ఞానంతోపాటు తమ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ప్రపంచంతో పోటీపడేందుకు మన విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎక్స్పొటెన్షియల్ పేరిట ఎక్స్పో నిర్వహించడం పట్ల స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. తొలుత ప్రదర్శనను బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మెన్ అట్లూరి విజయబాబు, ప్రిన్సిపాల్ హర్ సిమ్రాన్ కౌర్ ప్రారంభించారు. స్క్రాప్ ఆర్ట్, బయోడైవర్సిటీ డాక్యుమెంటరీలు, క్లైమేట్ యాక్షన్ వెబ్‌సైట్లు, ఎడ్యుకేషనల్ టాయ్స్, రోబోటిక్స్, ఆండ్రాయిడ్ యాప్స్ వంటి విభిన్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్‌విఆర్ ట్రైనింగ్ అండ్ కన్సల్టింగ్ సొల్యూషన్స్ సీఈఓ డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, టెకీబోట్ సీఈఓ వెంకట్ రెడ్డి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రిషాంత్ రెడ్డి, క్లైమేట్ యాక్షన్ నిపుణుడు రవికాంత్ రెడ్డి, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జగదీష్, అసోసియేట్ ప్రొఫెసర్, డీన్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ భాను చిత్ర న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ హర్ సిమ్రాన్ కౌర్ కపానీ, అడ్మిన్ హెడ్ పద్మలత మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణ, సహకార భావనకు నాందిపలికేలా ఈ ఏడాది నూతనంగా వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు

డిఆర్‌ఎంతో కేంద్ర సహాయ మంత్రి భేటీ



ప్రజాశక్తి - విజయవాడ సిటీ

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ శుక్రవారం విజయవాడ రైల్వే డీఆర్‌ఎం మోహిత్ సోనాకియాను ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్లో జరుగుతున్న పలు రైల్వే ప్రాజెక్టపై డీఆర్‌ఎం, అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో అమత్ భారత్ పథకంలో నర్సాపూరం, తాడేపల్లిగూడెం, భీమవరం స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ముఖ్యంగా నర్సాపూరం నియోజకవర్గంలోని ఆర్బి, ఆర్యూబీ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. అమృత్ భారత్ స్టేషన్లో జరుగుతున్న అభివద్ధి పనులపై మంత్రి సంతప్తి వ్యక్తం చేసి పనులు వేగవంతంగా జరగటం పట్ల అధికారులను ప్రశంసించారు. ఈ సమావేశంలో విజయవాడ డివిజన్ ఇంజీనిరంగ్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, గతిశక్తి యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

సిసి కెమెరాలకు చందనా బ్రదర్స్ సాయం



ప్రజాశక్తి-విజయవాడ : కృష్ణ లంక పోలీస్ స్టేషన్ పరిధిలో సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయడానికి రూ.10 లక్షలను శుక్రవారం సురక్షా కార్యక్రమానికి తమ వంతు సాయంగా చందనా బ్రదర్స్ వారు పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా చందనాబ్రదర్స్ వారు మాట్లాడుతూ... ఎన్‌టిఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆధునిక సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించుకుని తక్కువ సమయంలో నేరస్తులను గుర్తించి వారిని అరెస్టు చేయడంతోపాటు బాధితులకు స్వాంతన చేకూరేలాగా చర్యలు తీసుకొంటున్నారని అన్నారు. సైబర్ నేరాలను జరుగకుండా అన్ని విధాలుగా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దానిలో అన్ని బ్యాంకుల అదికారులను, సిబ్బందిని కూడా మమేకం చేసి వారి ద్వారా కూడా సైబర్ నేరాలు జరుగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించి విజయవాడ నగరంలో సైబర్ నేరాలు జరగకుండా కట్టడి చేశారని అన్నారు. అదే విధంగా కష్ణ లంక పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలు కూడా సురక్షితంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఏ.సి.పి. డి.పావన్ కుమార్ , కష్ణ లంక ఇన్స్పెక్టర్ ఎస్.ఎస్.వి నాగరాజు , చందన బ్రదర్స్ మేనేజర్ నూలు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.